# కుల వృత్తులకు జీవం..

- అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ పాలన
- యేటా బడ్జెట్‌లో అత్యధికంగా నిధుల కేటాయింపు
- జిల్లాలో లక్షా 50 వేల మందికి లబ్ధి
- సర్వత్రా హర్షాతిరేకాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : సీమాంధ్ర పాలనలో నిరాదరణకు గురైన కుల వృత్తులకు.. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు ప్రత్యేక పథకాలను అమలు చేస్తూ పూర్వ వైభవం తీసుకొచ్చింది. ఆయా వర్గాల వారు తిరిగి కుల వృత్తిలో స్థిరపడేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రెడీమేడ్ దుస్తులు వచ్చి మేర కులస్తులు.. చేనేత కార్మికులు, ప్లాస్టిక్, స్టీలు వస్తువులు వచ్చి కుమ్మరులు, మేదరికులస్తులు, వాషింగ్ మిషన్లు, డ్రైక్లీనింగ్ సెంటర్లు రావడంతో రజకులు, జువెల్లరీలతో స్వర్ణకారులు ఉపాధి కోల్పోవాల్సి వచ్చింది. ఈ తరుణంలో తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చేతి వృత్తులకు జీవం పోస్తూ వచ్చింది. బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించి ఆయా వర్గాల వారు తిరిగి తమ కుల వృత్తిలో స్థిరపడేలా కృషి చేసింది.

## జిల్లాలో 1.50 లక్షల మందికి లబ్ధి..

ఈ పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ వల్ల జిల్లాలో సుమారు 1.50 లక్షల మంది చేతి వృత్తివృత్తుల వారికి లబ్ధి చేకూరింది. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం ఏయే వర్గాల వారు చేతివృత్తుల్లో స్థిపరడి ఉన్నారో ఆయా కుటుంబాలకు నేరుగా నిధులు మంజూరు చేయడంతో పాటు ఆయా కుటుంబాలకు చేతి వృత్తుల ద్వార స్థిరమైన ఆదాయం చేకూర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్లింది. చేతి వృత్తులకు పూర్వవైభవం తెచ్చేందుకు ప్రభుత్వం చేసిన కృషిని ప్రతి ఒక్కరు కొనియాడుతున్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి..

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం గత పదేళ్లలో భారీగా నిధులు మంజూరు చేసింది. 100 శాతం సబ్సిడీపై చేప పిల్లలు పంపిణీ చేసింది. చేపలు పట్టి అమ్ముకునేందుకు కావాల్సిన వసతులు కల్పించింది. లోన్‌లు కూడా అందించి ఆర్థికాభివృద్ధికి కృషి చేసింది. ఆధునిక పద్ధతుల్లో చేపల వేట, మార్కెటింగ్ సౌకర్యం, చేప విత్తనాల ఉత్పత్తివంటి ప్రక్రియల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సమగ్ర మత్స్య అభివృద్ధి పథకం కింద 2017 –18, 2018–19 సంవత్సరాలకు జిల్లాకు రూ. 25 కోట్లు కేటాయించింది. జిల్లాలో 2,694 మంది సభ్యులతో 55 ప్రాథమిక మత్స్య సహకార సంఘాలు, 5 మినీ సహకార సంఘాలు ఏర్పాటు చేసింది. 2016 నుంచి 2023 వరకు రూ. 6 కోట్ల 98 లక్షల విలువల రూ. 7 కోట్ల 36 లక్షల చేప పిల్లలు ఉచితంగా అందించారు. రూ. 2 కోట్ల 15 లక్షల విలువైన రొయ్య పిల్లలను ప్రభుత్వం ఉచితంగా అందించింది. 616 మంది సభ్యులకు రూ. 5 కోట్ల 64 లక్షలతో ఉపకరణాలు అందించింది. రూ. 25 కోట్లతో మత్స్య మార్కెటింగ్ వసతులు కల్పించడంతో పాటు వాహనాలను సైతం పంపిణీ చేసింది. మత్స్యకారులకు రూ. 5 లక్షల బీమా సౌకర్యం కల్పించింది.

## గొల్ల కుర్మలకు సబ్సిడీ గొర్రెల పంపిణీ..

గొల్ల కుర్మల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్సిడీపై గొర్రెల పథకాన్ని అమలు చేసేంది. 2017 నుంచి 2023 వరకు 97 సంఘాల్లోని సభ్యులకు రూ. 36 కోట్ల 27 లక్షల 50 వేల విలువైన గొర్రెలను అందించింది. 2902 యూనిట్లను పంపిణీ చేసింది. సర్కారు చేపట్టిన చర్యలతో గొల్ల కుర్మల కుటుంబాల్లో ఆర్థిక సమస్యలు తొలగిపోయి.. ఆనందం వెల్లివిరుస్తోంది.

## కటింగ్, ఇస్త్రీ షాపులకు ఉచిత విద్యుత్

వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం పాటుపడుతున్న కేసీఆర్ సర్కారు బీసీ సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో 529 మందికి 100 శాతం రాయితీపై రూ. 50 వేల చొప్పున ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ. 2 కోట్ల 64 లక్షల రుణాలు అందించింది. 552 మంది నాయీ బ్రాహ్మణుల షాపులకు, 717 ఇస్త్రీ షాపులకు ఉచితంగా విద్యుత్ మీటర్లు అందించింది. 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల సంక్షేమానికి రూ. లక్ష వరకు బ్యాంకులతో సంబంధం లేకుండా పూర్తి సబ్సిడీపై రుణాలు అందించింది. చేనేత కార్మికులకు పింఛన్‌లు సైతం పంపిణీ చేస్తున్నది. కాగా, తమ ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన బీఆర్ఎస్ సర్కారుకు రుణపడి ఉంటామని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీనే తిరిగి గెలిపించుకుంటామని ఆయా వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

### ఉచిత చేప పిల్లలతో ఆర్థికంగా ఎదుగుతున్నాం..



కాగజ్‌నగర్, అక్టోబర్ 26: తెలంగాణ ప్రభుత్వం కులవృత్తులను ఆదుకుంటున్నది. గతంలో రూ. 2 లకు ఒక చేప పిల్ల కొనుగోలు చేసి చెరువుల్లో వేసేవాళ్లం. కానీ గతంలో చెరువులు అధ్వానంగా ఉండడంతో పాటు మట్టి చేరి నీరు నిలిచేది కాదు. దీంతో చేప పిల్లలు ఎదగకపోవడంతో పాటు భారీ వర్షాలకు కట్టలు తెగడంతో నష్టం జరిగేది. దీంతో అప్పులు పాలు కావడంతో పాటు కుటుంబా పోషణ భారంగా మారేది. అయితే తెలంగాణ ప్రభుత్వం 2018 నుంచి మత్స్యకారులను ఆదుకుంటుంది. యేటా చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తుంది. ఈ ఏడాది పాత ఈస్గాం పరిధిలోని మూడు చెరువుల కోసం 96 వేల చేపపిల్లలు ప్రభుత్వం ఉచితంగా అందించింది. వాటిలో వచ్చిన ఆదాయంతో గతంలో చేసిన అప్పులు సైతం తీర్చుకున్నాం. అంతేగాకుండ పాత ఈస్గాం పరిధిలోని మత్స్యకారుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ఒక మినీ వ్యాన్, టాటాఎస్, ఏడు ఎక్సల్(ద్విచక్రవాహనాలు) సబ్సిడీపై అందించింది. వాటిపై గ్రామాలు, పట్టణాలకు వెళ్లి చేపలు విక్రయించి ఆర్థికంగా ఎదుగుతున్నాం. సీఎం కేసీఆర్ సారుకు రుణపడి ఉంటాం.

**చిట్ల రాజ్‌కుమార్, మత్స్యకారుడు**

# ఆశీర్వదిస్తే అభివృద్ధి చేస్తా



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి

- ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి
- రెబ్బెనలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం

రెబ్బెన, అక్టోబర్ 29 : బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు 30 రోజుల పాటు కష్టపడి తనను గెలిపిస్తే ఐదేళ్ల పాటు అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి అన్నారు. మండలకేంద్రంలోని కేకే గార్డెన్‌లో ఆదివారం రాత్రి బీఆర్ఎస్ మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధే బీఆర్ఎస్ పార్టీని గెలిపించి మూడోసారి అధికారంలోకి తీసుకువస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు అరిగెల నాగేశ్వర్‌రావు, ,వేముర్ల సంతోష్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్ కుమార్, వైస్ ఎంపీపీ గజ్జల సత్యనారాయణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రంగు మహేశ్ గౌడ్, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చెన్న సోమశేఖర్, రైతుబంధు సమతి జిల్లా సభ్యురాలు కుందారపు శంకరమ్మ, సర్పంచ్‌లు పోటు సుమలత, బొమ్మనేని అహల్యాదేవి, పందిర్ల వినోద, వడాయి మాధవి, ఎంపీటీసీలు సంఘం శ్రీనివాస్, పెసరి మధునయ్య పాల్గొన్నారు.

# నామినేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బోర్కడే హేమంత్

సిర్పూర్(టీ), అక్టోబర్ 29 : నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ (ఎన్నికల అధికారి) బోర్కడే హేమంత్ అన్నారు. సిర్పూర్(టీ) నియోజకవర్గం పరిధిలోని సిర్పూర్(టీ) తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్, సిర్పూర్(టీ) నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దీపక్ తివారీతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నుంచే నామినేషన్లు స్వీకరిస్తామని, 10న ఆఖరు తేదీ కాగా, 13న పరిశీలన, 15న ఉప సంహరణ ఉంటుందన్నారు. అలాగే 30న పోలింగ్ , డిసెంబర్ 3న కౌంటింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఏమైనా తప్పులుంటే వెంటనే లిఖిత పూర్వకంగా సంబంధిత అభ్యర్థికి సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ రమేశ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు

సిర్పూర్(టీ), అక్టోబర్ 29 : మండలకేంద్రంలోని సిర్పూర్(టీ) అసెంబ్లీ నామినేషన్ కేంద్రాన్ని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ కేంద్రం నుంచి 100 మీటర్ల దూరం వరకు బారికేడ్లు ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల విధుతు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ దీకొండ రమేశ్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వాంకిడిలో రూ.5. 89 లక్షల సీజ్



స్వాధీనం చేసుకున్న నగదుతో ఎస్ఐ

వాంకిడి,అక్టోబర్ 29 : మండలంలోని టోల్‌ప్లాజా వద్ద ఆదివారం వాంకిడి పోలీసులు మహారాష్ట్రకు చెందిన నగేశ్ అగర్వాల్ కారులో తరలిస్తున్న రూ.5 లక్షలు, మరో వాహనంలో టెంగ్రే శరత్ వద్ద రూ.89 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదు మొత్తం రూ.5. 89 లక్షలను స్వాధీనం చేసుకొని ఎఫ్ఎస్‌టీ టీంకు అప్పగించినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

## బెల్లంపల్లిలో మద్యం పట్టివేత

బెల్లంపల్లిరూరల్, అక్టోబర్ 29: బెల్లంపల్లి పట్టణంలోని కన్నాలబస్తీ ప్రాంతంలో అదే ప్రాంతానికి చెందిన దానం రవి సంచిలో మద్యం తీసుకెళ్తుండగా ఆదివారం పట్టుకున్నట్లు వన్‌టౌన్ సీఐ బన్సీలాల్ తెలిపారు. పట్టుబడ్డ మద్యం విలువ రూ 4860 ఉంటుందని పేర్కొన్నారు. రవిని విచారించగా తాను ఇంట్లో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు అంగీకరించినట్లు సీఐ తెలిపారు. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా పట్టణంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో మద్యంతో పట్టుబడిన కన్నాలబస్తీకి చెందిన రాపెల్లి శారదపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ బన్సీలాల్ తెలిపారు. ఆమె వద్ద రూ 2,340 విలువ చేసే మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తన ఇంట్లో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపునకు వైన్ షాప్ నుంచి మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు అంగీకరించినట్లు ఆయన తెలిపారు.

## వీగాం గ్రామంలో..

కన్నెపల్లి, అక్టోబర్ 29 : మండలంలోని వీగాం గ్రామానికి చెందిన కొయ్యాడ సతయ్య గౌడ్ వద్ద మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. విచారించగా తన ఇంట్లో బెల్టుషాపు నడుపుతూ మద్యం అమ్ముతున్నట్లు పేర్కొన్నాడని తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535
★ ఒక ప్రముఖ సర్వే సంస్థలో తెలంగాణ ఎలక్షన్ క్యాంపెయిన్ & సర్వే చేయుటకు రాజకీయ అవగాహన కలిగిన వెండార్స్ (500+టీం మెంబర్స్) కావలెను. సంప్ర: 7396856819, 7386886819.
NT-320424-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677